తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
26 ఏప్రిల్ 2025
పేజీలు : 10



# ఉగ్ర దాడి హేయమైన చర్య

**దుండగులను కఠినంగా శిక్షించాలి - మజిద్- ఉన్- నసీర్ సొసైటీ అధ్యక్షుడు నసీరుద్దీన్**



**సిద్ధిపేట ఏప్రిల్ 25 (జనం సాక్షి)**
కాశ్మీర్లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు అమానుషంగా హిందూ బంధువులను కాల్చి చంపడం హేయమైన చర్య అని మస్జిద్-ఉన్-నసీర్ సొసైటి వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ నసీరొద్దీన్ అన్నారు. దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. శుక్రవారం నమాజ్ అనంతరం ముస్లింలతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించి పహల్గాంలో ఉగ్ర దాడిలో చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని వేడుకున్నారు.

మిగతా2లో







# ఉపాధి పనులను పరిశీలించిన విదేశీ ప్రతినిధుల బృందం

**సదాశివపేట ఏప్రిల్ 25(జనం సాక్షి)**
సదాశివపేట మండల పరిధి సూరారం గ్రామంలో శుక్రవారం 25మంది విదేశీ ప్రతినిధుల బృందం పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ విదేశీ బృందం సభ్యులు ముందుగా సూరారం గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న ఉపాధి హామీ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఉపాధి హామీ కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక వేతన దారులతో మాట్లాడి అప్పటి వరకు నిర్వహించిన పనులపై ఆరా తీసి, వేతనదారుల ఆదాయం, పని దినాలు, ఉపాధి సిబ్బందికి సమకూర్చిన సౌకర్యాల గురించి ప్రశ్నించారు. పర్యటనలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి మాట్లాడుతూ



జిల్లాల్లో రూరల్ డెవలప్మెంట్‌పై ఈ సంవత్సరం, గత సంవత్సరం నిర్వహించిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించే నిమిత్తం ఈ బృందం వచ్చిందని తెలిపారు. అనంతరం విదేశీ బృందం సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ లో పథకం అమలు పద్ధతులను మెచ్చుకు న్నారు. ప్రత్యేకించి డిజిటల్ మానిటరింగ్ విధానాలు, పారదర్శక చెల్లింపు వ్యవస్థలు, మహిళా భాగ్యస్వామ్యం వంటి అంశాలను ప్రశ్నించారు. తెలంగాణలో ఎంజిఎన్ఆర్ ఇజిఎస్ పథకం

మిగతా2లో

# దేశానికే రోల్ మోడల్ భూభారతి

**ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**



**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 25 (జనం సాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. మెదక్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డిఓ రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో ఆయన పాల్గొన్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రైతులు ఎడ్ల బండి ద్వారా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధరణి స్థానంలో నూతన చట్టాన్ని తేవడానికి ప్రభుత్వం నిపుణులతో కమిటీని వేసి

మిగతా2లో

# అనుచిత పోస్టులు పెడితే చర్యలు

**జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25, (జనం సాక్షి):**
నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ రాజకీయంగాను, కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు,శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్ బుక్,ట్విట్టర్, ఇంస్టాగ్రామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ నీ బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయని తెలిపారు. సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపైన ప్రత్యేకంగ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ తరహా నేరలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.

# స్టేట్ ర్యాంకర్లను సన్మానించిన ఎమ్మెల్యే చింతా



**సదాశివపేట ఏప్రిల్ 25(జనం సాక్షి)**
ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో సదాశివపేటలోని ఉజ్వల జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం( సిఈసి)లో రాష్ట్రస్థాయి (5వ ర్యాంక్)సాధించిన ఆఫ్రా బేగం తోపాటు టౌన్ స్థాయిలో సినియర్ ఇంటర్( బైపిసీ)లో 985 మార్కులతో టౌన్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన నేహా పిర్దోసి, (ఎంపీసీ)లో 950మార్కులతో టౌన్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన మోమీనా బేగం, (సిఈసి) లో 939 మార్కులతో టౌన్ ర్యాంక్ సాధించిన అక్షిత ను శుక్రవారం సదాశివపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శాలువలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ జీవిత లక్ష్యాలకు అనుగుణంగా తమ ప్రణాళికలను ఎంచుకొని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిగమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ అమరేందర్ రెడ్డి, డైరెక్టర్ ముద్ద నాగనాథ్, రఘువర్ధన్ రెడ్డి, కరస్పాండెంట్ పోల వెంకటేశం, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

**- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు**

**నంగునూరు, ఏప్రిల్ 25 (జనం సాక్షి)**
వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు మండి పడ్డారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని పాలమాకుల గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని శు క్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వడ్ల కొనుగోలు తీరుపై రైతులను ఆరా తీశారు. కొనుగోలు కేంద్రంలో సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట వంటి జిల్లాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం వల్ల రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని చెప్పారు. క్వింటాలుకు రూ. 2,320లు మద్దతు ధర రావాల్సి ఉండగా దళారులకు రూ.రెండు వేల నుండి రూ. 2,100లకే అమ్ముకుంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల భయంతో రైతులు కల్లాల్లో ధాన్యాన్ని దళారులకు అమ్ముకునే దుస్థితి నెలకొందన్నారు. గత ఏడాది వానా కాలంలో మొత్తం 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి కేవలం 52 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ప్రభుత్వం సేకరించారని చెప్పారు. మిగతా 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బయట వదిలి వేసిందన్నారు. అంటే మూడు వంతుల్లో ఒక వంతు మాత్రమే కొనుగోలు చేసిందని చెప్పారు. రెండొంతుల ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకు అమ్ముకున్నారని తెలిపారు. యాసంగి పంట కొనుగోళ్లలో ప్రభుత్వం అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని,

మిగతా2లో



## ఉపాధి పనులను పరిశీలించిన విదేశీ ప్రతినిధుల బృందం



గ్రామీణ అభివృద్ధికి ఒక ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా ఉపాధి హామీ పథకం భారతదేశంలో మాత్రమే ఉన్నదని వారు ప్రశంసించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు 100 రోజుల పని కల్పించడం గొప్ప విషయమని తెలిపారు. అంతకుముందు ఉపాధి హామీ పథకంలో చేసిన పనులతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ను తిలకించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సృజన, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా అదనపు కలెక్టర్ లు చంద్రశేఖర్,మాధురి, అడిషనల్ కమిషనర్ శేషు కుమార్, టీడీ డీఆర్డీఏ జ్యోతి, డిఆర్‌డిఓలు బాలరాజ్, జంగారెడ్డి, ఎన్జీవో ప్రతినిధులు వర్షిని, ఆర్డీవో రవీందర్ రెడ్డి, ఎమ్మార్వో సరస్వతి, ఎంపీడీవో లక్ష్మి, డీఎస్పీ సత్తయ్య గౌడ్, స్థానిక సీఐ మహేష్ గౌడ్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

రుణ మాఫీ చేస్తామని చెప్పి సగం మంది రైతులకు చేయలేదని విమర్శించారు. రైతుబంధును వానాకాలంలో ఎగ్గొట్టిందని అన్నారు. యాసంగిలో రెండు మూడు ఎకరాలకు మాత్రమే ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలు, గాలి దుమారం వల్ల మూడు నాలుగు లక్షల ఎకరాల్లో పంటదెబ్బతిన్నదని అన్నారు. ఎకరానికి రూ.20 వేల పంట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ల ద్వారా నివేదిక తెప్పించుకొని రైతులను ఆదుకోవాలని కోరారు. పాలమాకుల వద్ద కొనుగోలు కేంద్రంలో వడ్లు కొని వారం రోజులు అయినా రైతులకి డబ్బులు చెల్లించ లేదని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 48 గంటల్లో రైతులకు డబ్బులను అకౌంట్లో వేస్తున్నామని హైదరాబాద్ లో చెప్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు విరుద్ధంగా ఉన్నాయన్నారు. గోనె సంచులు నాణ్యంగా లేకపోవడం వల్ల హమాలీలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తూకంలో క్వింటాలుకి రెండు కిలోలు తరుగు తీస్తున్నారని ఆరోపించారు. అటు అకాల వర్షాలు, ఇటు రైతు బంధు, మద్దతు ధర రాక ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని వెంటనే ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దేశానికే రోల్ మోడల్ భూభారతి



అన్ని రాష్ట్రాల్లో పరిశీలించి రైతులకు సులువైన చట్టాన్ని అందుబాటులో తెచ్చినట్లు తెలిపారు. రైతు ప్రభుత్వంగా రైతులకు అన్ని రకాలుగా అన్ని అండదండలు అందిస్తూ ఎవరైతే భూములు కొనుగోలు చేసి పట్టాలు రాక ఇబ్బందులు. పడే వారి సమస్యలు పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ భూ భారతితో రైతుల భూములకు పటిష్ట రక్షణ కలుగుతుందనిపట్టాలు రావడం వల్ల రైతు భరోసా, రైతు బీమా బ్యాంకు రుణాలు వస్తాయని తెలిపారు. రైతులు గ్రామాలలో భూ భారతి చట్టంపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మే మాసంలో మన జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు గా ఎంపిక చేసి భూ సమస్యలు పరిష్కారం. కొరకు రైతు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. భూభారతి చట్టం జూన్ రెండో తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్ర దాడి హేయమైన చర్య





ప్రత్యేకంగా దువా చేసారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ఆయన మాట్లాడుతూ కొత్తగా పెళ్ళైన వారు, అధికారులు, పర్యాటకుల్లో పురుషులను వేరు చేసి భార్యా బిడ్డల ముందే హతమార్చడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన క్షతగాత్రులందరు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భారతీయులమంతా కలిసిమెలిసి కులమతాలకు అతీతంగా సహజీవనం గడుపుతామని చెప్పారు. చిన్నప్పటి నుండే పాఠశాలల్లో భారత దేశం నా మాతృభూమి భారతీయులందరూ నా సహోదరులు అని ప్రతిజ్ఞ చేస్తామని చెప్పారు. భారతీయులు ఎవరి బాధనైనా తన బాధగా స్వీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారుక్ హుస్సేన్, మగ్దూం, తస్లీమ్, సాజిత్, జుబేర్, ఎజాస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### నివాళులర్పించిన బుద్ధారం ముస్లీం సోదరులు

**రేవల్లి, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** గోపాల్ పేట్ మండలంలోని బుద్దారం గ్రామంలో జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పులలో మరణించిన భారతీ యులకు గ్రామంలోని మసీదులో నల్ల బ్యాడ్జీలు ధరించి నివాళులర్పించారు.

### ఘన నివాళులు అర్పించిన ముస్లిం సోదరులు

**రేవల్లి, ఏప్రిల్ 25 (జనంసాక్షి)**

గోపాల్ పేట్ మండల కేంద్రంలోని జామ మసీద్ దగ్గర ముస్లిం యువకులు ౖ జమ్మూ కాశ్మీర్ పహాల్గామ్‌లో మంగళవారం ఉగ్రవాదులు జరిపిన కాల్పులలో చనిపోయిన భారతీయుల ఆత్మకు శాంతి చేకూరాలని ఉగ్ర దాడిలో మృతి చెందిన భారతీయులకు ఘన నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మా ట్లాడుతూ భారతీయుల పైన ఉగ్రదాడి పిరికిపంద చర్యగా, ఉగ్రవాదులను హతమా ర్చడం కోసం భారతీయులమంతా ఏకం అవ్వాలని, ఉగ్ర దాడులతో భారత దేశ పర్యాటక అభివృద్ధిని నిలువరించలేరని గ్రామ ముస్లిం ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. గోపాల్ పేట్ ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

### దన్వాడలో ముస్లింల నిరసన

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25, (జనం సాక్షి):** జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం ధన్వాడ మండల కేంద్రంలో ముస్లింలు జామీయ మస్జిద్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రార్థనలు చేసి నిరసన తెలిపారు. అదేవిధంగా ఈ దాడిలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తు రెండు నిమిషాలు మౌనం పాటించారు. జామీయా మసీదు సదర్ ఎక్బాల్ ఖాన్ మాట్లాడుతూ ఈ నేరానికి పాల్పడిన దోషులను ఎన్కౌంటర్ చేయలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధన్వాడ జామీయా మస్జిద్ కమీటీ సభ్యులు పెద్దలు, ముస్లిం యువకులు, తదితరులు పాల్గొన్నారు.






### అమరులకు కొవ్వొత్తులతో నివాళి

**మెదక్, ఏప్రిల్ 25 (జనం సాక్షి):**

జమ్మూకశ్మీర్లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా. శివదయాల్ మాట్లాడుతూ సామాన్య ప్రజలపై ఉగ్రవాదుల దాడులు సరికాద న్నారు. టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు డాక్టర్లు చంద్రశేఖర్, విజయ్ కుమార్, నవీన్ కుమార్, పెంటాగౌడ్, కిరణ్ కుమార్ రెడ్డి, చంద్రమౌళి, అశోక్ కుమార్, సుష్మా, సునితా తదితరులు పాల్గొన్నారు.

### ఉగ్ర దాడులను నిరసిస్తూ నిరసన ర్యాలీ

**- పాల్గొన్న జెడ్పి మాజీ చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత**

**గద్వాల్ రూరల్ ఏప్రిల్ 25 జనంసాక్షి**

ఉగ్ర దాడులను నిరసిస్తూ చేపట్టిన క్రొవొత్తుల నిరసన ర్యాలీలో జెడ్పి మాజీ చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బి.ఎస్.కేశవ్.జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని ఏఐసిసి,టిపిసిసి పిలుపు మేరకు మాజీ జెడ్పి చైర్ పర్సన్ సరిత మున్సిపల్ మాజీ చైర్మన్ బి.ఎస్.కేశవ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పాత బస్టాండు నుండి క్రిష్ణవేణి చౌరస్తా వరకు క్రొవొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ కాశ్మీర్‌లో ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఉగ్రవాదుల దాడి హేయనీయం

**- పూజ్యశ్రీ డా స్వామి శాంతానంద**



**నారాయణపేట జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 (జనం సాక్షి):**

పహల్గావ్ లో సామాన్య యాత్రికులపై మూకుమ్మడి ఉగ్ర దాడి చేసి అమానవీయంగా ప్రజలను చంపడం హేయమైన చర్య అని ,ప్రత్యేకించి హిందువులను లక్ష్యంగా చేసుకుని హిందువులపై దాడి చేసి చంపడం దారుణమైన విషయమని.ఇట్టి ఉగ్రవాద దాడులను శక్తి పీఠం తీవ్రంగా ఖండిస్తుందని శక్తి పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డా స్వామి శాంతానంద పురోహిత్ అన్నారు.అంతకుముందు శక్తి పీఠం నుండి సెంటర్ చౌక్ వరకు ఉగ్రదాడులను నిరసిస్తూ శాంతియుత నిరసన ర్యాలీని చేపట్టారు. ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన హిందూ సోదరులకు శ్రద్ధాంజలి ఘటించి...మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి రెండు నిమిషాల పాటు మౌనాన్ని పాటించారు.ఇట్టి కార్యక్రమములో శక్తి పీఠం ట్రస్ట్ సభ్యులు భజనా మండలి సభ్యులు ,మహిళా కమిటీ సభ్యులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**రేవల్లి, ఏప్రిల్ 25 (జనంసాక్షి)**

2007-2008 బృందం పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుక రేవల్లి హైస్కూల్‌లో వైభవంగా జరిగింది. ఈ వేడుక లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనాటి జ్ఞాపకాలు గుర్తుకు చేసుకున్నారు. అదే విధంగా విద్యార్థులు కూడా గురువులను సన్మానించారు. ఈ వేడుకలో భాగంగా ఆనాటి ప్రధానోపాధ్యాయులు వెంకట శెట్టి, ఉపాధ్యాయులు సంజీవ గౌడ్, రవీంద్రచారి, నరసింహ రెడ్డి, నరేంద్రచారి, శ్రీధర్, హుస్సేన్, చంద్రశేఖర్, లచ్చిరాం, తాజ్ జ్యోతిన్, నరేంద్రమని, నూర్జహాన్, ఆనాటి స్కూల్ చైర్మన్ చెన్నారెడ్డి, మరియు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ దిమ్మె స్థలం కోసం వినతి

**రేవల్లి, ఏప్రిల్ 25 (జనంసాక్షి)**



రేవల్లి మండల అధ్యక్షులు బాలు నాయక్ దేశాల మేరకు గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు తిరుపతి ఆధ్వర్యంలో రేవల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పార్టీ జెండాను ఎగురవేయాలని గ్రామ పరిధిలో ఎక్కడైనా శాశ్వతంగా ఉండే విధంగా స్థలం కేటాయించాలని రేవల్లి మండల ఎమ్మార్వో లక్ష్మీదేవి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు తిరుపతి నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

## సెలవుల్లో సమయాన్ని వృధా చేసుకోకూడదు : ఎస్సై



**వెల్దండ ఏప్రిల్ 25 (జనంసాక్షి) :**

వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా ఎస్సై కురుమూర్తి అన్నారు. శుక్రవారం వెల్దండ మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ శృతిలయ కల్చరల్ అకాడమీ వారి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న LLL ప్రోగ్రాం వేసవి శిక్షణ శిబిరాన్ని వెల్దండ మండలం, చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులందరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి శ్రీరామ్ మండల ఇన్చార్జి మల్లేష్ బ్రాంచి ఇన్చార్జులు రవళి, శ్రీకళ కోఆర్డినేటర్స్ పావని ప్రేమలత మహేశ్వరి పాల్గొన్నారు.

## శుక్రవారం బంగారు మైసమ్మకు ప్రత్యేక పూజలు



**జడ్చర్ల, ఏప్రిల్ 25 (జనం సాక్షి):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట డాక్ (ఐబి) బంగ్లా సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం పురస్కరించుకొని భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవతకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమ ంలో దేవాలయ చైర్మన్ గోనెల నరేందర్ మహేశ్వరి దంపతులు, ఉపాధ్యక్షులు గుండు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, భక్తులు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**భూ భారతి చట్టంతో ..**

# పెండింగ్ భూ సమస్యలకు పరిష్కారం

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 25, (జనం సాక్షి):**

ఎన్నో సంవత్సరాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. రైతులు ఈ కొత్త చట్టంలోని సెక్షన్లపై అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా శుక్రవారం కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్‌లో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరణిలో ఉన్న సమస్యలను గుర్తించి ధరణి స్థానంలో రైతులకు మేలైన చట్టం తేవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ధరణిని రద్దుచేసి రైతు సంఘాలు, రెవెన్యూ అధికారులు, మేధావులతో చర్చలు జరిపి ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు సంబంధించిన అన్ని భూ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వారికి భూధార్ కార్డును ఇవ్వడం జరుగుతుందన్నారు. ధరణిలో అధికారులకు అధికారాలను తొలగించడం వల్ల భూ సమస్యల పరిష్కారం నిమిత్తం రైతులు



సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, భూ భారతిలో అలాంటి అవసరం లేదని తెలిపారు. కింది స్థాయి అధికారుల వద్ద పొరపాట్లు జరిగితే లేదా పని కాకపోయినా పై స్థాయి అధికారులు న్యాయం చేసే అవకాశం భూ భారతిలో ఉందన్నారు. ధరణిలో రూల్స్ లేవని, కానీ భూ భారతిలో నిర్దిష్టమైన రూల్స్ ఉన్నాయని ఆమె తెలిపారు. అధికారులు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, అలాగే రైతులు సైతం భూ భారతి చట్టం అమలులో అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూముల సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లను నియమించనుందని చెప్పారు. ధరణిలో లేని అనేక వెసులుబాట్లు భూ భారతి చట్టంలో ఉన్నాయన్నారు. చట్టంలో మోకపై ఉన్న రైతులకు హక్కు ఉండాలన్నదే భూ భారతి చట్టం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. 99 శాతం కేసులు భూ భారతిలో తహసిల్దార్ వద్దనే ఉచితంగానే పరిష్కారం అవుతాయన్నారు. మ్యుటేషన్లు 30 రోజుల్లో అవుతాయని, ఒకవేళ కాకపోతే పోర్టల్‌లో ఆటోమేటిక్‌గా 31 రోజు అవుతుందని తెలిపారు. కింది స్థాయి నిర్ణయాన్ని పై స్థాయిలో అప్పీల్ అవకాశం భూ భారతిలో ఉందన్నారు. పాత చట్టంలోని లోటు పాట్లు, కొత్త చట్టంలోని వెసులుబాట్ల గురించి కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. ఈ సదస్సులో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ కుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు భీమ్ రెడ్డి, తహసిల్దార్లు బక్క శ్రీనివాస్, భాస్కర స్వామి, ఎంపీడీవో శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ నాగ రాజు, కోస్గి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘు వర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత

**జడ్చర్ల, ఏప్రిల్ 25 (జనం సాక్షి):**

అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇండ్లను శుక్రవారం చైర్ పర్సన్ పుష్పలత ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి లబ్ధిదారుల వివరాలను, ఇంటి స్థలాలను మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని ఎవరైనా అధికారులు, ప్రజాప్రతినిధులు డబ్బులు డిమాండ్ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అట్టి విషయాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని అన్నారు. విడతల వారీగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిర మ్మ ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు లక్ష్మమ్మ,



మల్లికార్జున్, పద్మ, తహసిన్, వార్డ్ ఆఫీసర్ రామ్ మోహన్ రావు, నాయకులు కోనేటి నరసింహులు, ఎర్ర ఆనంద్, శాంతయ్య, సిబ్బంది శివ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**- పాల్గొన్న రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాడల పర్వతాలు**

**- సింగిల్ విండో చైర్మన్ లోడే రఘు యాదవ్**

**రేవల్లి, ఏప్రిల్ 25 (జనంసాక్షి)**

రేవల్లి మండలంలోని నాగపూర్, శానాయిపల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వాడల పర్వతాలు సూచించారు.

ఈ సందర్భంగా వాడల పర్వతాలు మాట్లాడుతూ రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని నిర్వహణకు సంబంధించిన సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, సేదతీరెందుకు నీడ సౌకర్యం, గన్ని బ్యాగుల సౌకర్యం ఉండేలా చూడాలని తేమ నిర్ధారణ విషయంలో అన్నదాతలను ఇబ్బందులకు గురి చేయకూడదని వాడల పర్వతాలు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో



ధాన్యం విక్రయించిన అన్నదాతలకు అందుకు సంబంధించిన డబ్బులను వారి ఖాతాల్లో వెంటనే జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో మొత్తం 414 కేంద్రాల ఏర్పాటుకు గాను నేటికీ 318 కేంద్రాలను ప్రారంభించినట్లు వాడల పర్వతాలు పేర్కొన్నారు. కొనుగోళ్ల విషయంలో రైతులు ఆవేదన చెందరాదని చివరి గింజ వరకు ధాన్యాన్ని కొంటామని వాడల పర్వతాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ లోడే రఘు యాదవ్, రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్వతాలు, డీపీఎం అరుణ, మహిళా మండల అధ్యక్షురాలు స్వప్న, ఎపిఎం సావిత్రి, ఏఈఓ శిల్ప, ఎత్తపు మురళి, అరేకంటి సిరి మల్లేష్, అంబటి పల్లి లింగస్వామి, కూర చందు, గ్రామ మహిళా అధ్యక్షులు లావణ్య, మిద్దె రాములు, చెన్నకేశవులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ చిత్రపటంలో వరంగల్ సభ చారిత్రాత్మకం

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి, ఏప్రిల్ 25 (జనంసాక్షి):** ఈ నెల 27న వరంగల్ లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ రాజకీయ చిత్రపటంలో చారిత్రాత్మకంగా నిలువనుందని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభివర్ణించారు. శుక్రవారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన సభా స్థలిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క ఉమ్మడి జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఒకే చోట స్థలాన్ని కేటాయించడం సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. తెలంగాణ సాధనలో గౌరవ కెసిఆర్ ఎన్నో చారిత్రాత్మక సభలు నిర్వహించారని,కాని ఈ అంతకు మించి కాని ఈ సభను నిర్వహించి తన రికార్డును మరోసారి రుజువు చేసుకోబోతున్నారని అన్నారు.పది లక్షల మందికి తగ్గకుండా ఉండే ఈ సభకు పార్టీ అన్ని ఏర్పాట్లు చేసిందని, రాష్ట్ర సాధకుడు కె.సి.ఆర్ చేయబోయే దిశా నిర్దేశం కోసం తెలంగాణ ప్రజలే కాక యావత్ భారత ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు.ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేస్తారని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. నిరంజన్ రెడ్డి వెంట జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మండల,పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్,వనం రాములు,మాణిక్యం,రాళ్ళకృష్ణయ్య, లక్ష్మారెడ్డి,రఘుపతి రెడ్డి,దిలీప్ రెడ్డి,విజయ్ కుమార్, కర్రేస్వామి,సామ్యా నాయక్,శషివర్ధన్ రెడ్డి,కుమార్ యాదవ్, ఎల్లారెడ్డి,వడ్డే రమేష్ తదితరులు ఉన్నారు.

# 108,102, పార్థివ వాహనాలు తనిఖీ



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 25 (జనం సాక్షి)** జోగులాంబ గద్వాల జిల్లా 108,102, పార్థివ వాహనాలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఫ్లీట్ హెడ్ గిరీష్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్, గద్వాల జిల్లా కోఆర్డినేటర్ రత్నమయ్య పాల్గొన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలు గద్వాల హాస్పిటల్ 108 అంబులెన్స్ రికార్డులను, అంబులెన్స్ పరికరాల యొక్క పనితీరును, సిబ్బంది యొక్క పనితీరును పరిశీలించారు. అదేవిధంగా 102 అమ్మఒడి వాహనాన్ని కూడా తనిఖీ చేశారు. గర్భిణీలకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. వాహన నిర్వాహనని కూడా సరిగ్గా చేసుకోవాలని వివరించారు. అంబులెన్స్‌లను జాగ్రత్తగా నడపాలని ఎల్లప్పుడూ ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈఎంటీ లు,పైలట్ లు పాల్గొన్నారు.

# చలో వరంగల్ సభను విజయవంతం చేయండి

**యువ నాయకుడు సిర్సనగండ్ల శేఖర్**

**సీనియర్ నాయకులు జంగిలి ప్రసాద్**





**వెల్దండ ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** వెల్దండ. ఈనెల 27న వరంగల్లో జరిగిన బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ మండల యువ నాయ కుడు సిర్సనగండ్ల శేఖర్ పిలుపునిచ్చారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం బిఆర్ఎస్ దిమ్మెలకు రంగులు వేసి జెండా ఎగురుడవేయడానికి సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జంగిలి ప్రసాద్,కూన భాస్కర్, బిట్టి సైదులు,కొప్పు నరసింహ,కట్ట అనిల్,బిట్టి గోపాల్ ,తదితరులు పాల్గొన్నారు.

# మల్దకల్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీ

**మల్దకల్ ఏప్రిల్ 25 (జనంసాక్షి)** మల్దకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీని శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ స్వరూప రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మలేరియా గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెూమియోపతి డాక్టర్ జయమ్మ,సి హెచ్ఓ వెంకటస్వామి, సూపర్వైజర్లు శ్రీధర్,వెంకటనరసమ్మ,హెల్త్ అసిస్టెంట్ దేవన్న,ఆశ వర్కర్లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## కళాకారులకు ఆర్థిక సాయం అందజేత



**వెల్దండ ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కళా బృంధం సభ్యులు గత మూడు రోజుల నుండి మునిరంగ స్వామి స్టేజి నాటక ప్రదర్శన చేశారు. దీంతో బిఆర్ఎస్ యువనాయకుడు తగుళ్ల కొండల్ యాదవ్ రూ.10,116 విరాళం అందజేశారు. సందర్భంగా సంస్కృతి, సంప్రదాయాలకు, కళాపోషణ అంతరించిపోకు ండా చూడాలని కళాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కండేయుడు, చిన్న సైదయ్య, గోపాలు, వెంకటయ్య కళాకారులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి మహిళా మృతి

**గద్వాల్ రూరల్ ఏప్రిల్ 25 (జనంసాక్షి)** ట్రాక్టర్ బోల్తా పడి మహిళా మృతి చెందింది. వివరాల మేరకు.. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో గద్వాల మండలం లత్తిపురం గ్రామంకు చెందిన కలిమి పావని (30), భర్త కలిమి శంకరన్న భార్య భర్తలు ఇద్దరు కలిసి వెంకటోని పల్లి గ్రామం నందు ట్రాక్టర్‌లో కంకర నింపుకొని తిరిగి గ్రామానికి వెళ్లే మార్గమధ్యలో జమ్మిచెడు శివారులోని 9వ కాలవ దగ్గర ట్రాక్టర్ డ్రైవర్ సురేందర్ ట్రాక్టర్ను అతివేగంగా నడపడంతో అదుపుతప్పి ట్రాలీ తిరగ పడింది. పావని తలకి గాయమై అక్కడికక్కడే మృతి చెంది నట్లు ఇట్టి విషయంపై మృతురాలు భర్త కలిమి శంకరన్న శు క్రవారం 25 తేదీ నాడు గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా రూరల్ ఎస్సై సిహెచ్ శ్రీకాంత్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మలేరియా నిర్మూలనకు కృషి

**మక్తల్, ఏప్రిల్ 25 (జనంసాక్షి)** దోమకాటుతో వ్యాపించే మలేరియా వ్యాధిని పూర్తిస్థాయిలో అరికడదామని పల్లె దవఖాన డాక్టర్ తిరుపతి అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మక్తల్ మండలంలోని కర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హబీబ్, డాక్టర్ వినోద్, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ సమీనా, సూపర్వైజర్ సాయిబాబు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.




# భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి

**- కలెక్టర్ రాహుల్ రాజ్**

**నార్సింగి ఏప్రిల్ 25 జనం సాక్షి** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి - ఆర్.ఓ.ఆర్ చట్టం ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం నార్సింగి మండల కేంద్రం లోని రైతు వేదికలో స్థానిక తహశీల్దార్ షేక్ కరీం ఆధ్వర్యంలో భూ భారతి - ఆర్.ఓ.ఆర్ చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. స్థానిక అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందని, రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నిపుణుల కమిటీతో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, పటిష్టమైన చట్టాన్ని రూపొందించి అమల్లోకి తెచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసిల్దార్ షేక్ కరీం, ఎంపిడిఓ ఆనంద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు శ్రీధర్, మేఘన, మండల సర్వేయర్ శ్రీకాంత్, ఎం.ఏ.ఒ యాదగిరి, ఎం.పీ.ఓ సయీద్, పీ.ఏ.సీ.ఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి, ఏ.ఈ.ఓ లు విజృంభణ,దివ్య, ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్, ఐకేపీ సీసీ శంకర్, సుల్తానా నాయకులు పాల్గొన్నారు.

## చలో వరంగల్ సభను విజయవంతం చేయండి



**వెల్దండ ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** ఈనెల 27న వరంగల్లో జరిగిన బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ మండల యువ నాయకుడు ఆనంద్ పిలుపునిచ్చారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం బిఆర్ఎస్ వాల్ పోస్టర్లను వెల్దండ మండలంలోని వెల్దండ పెద్దాపూర్ , రాచూర్, కుప్పగండ్ల, చౌదర్పల్లి, రాగాయిపల్లి, చెరుకూరు బర్కత్ పల్లి నారాయణపూర్ ,పలుగుతండ, పోచమ్మ గడ్డ తండా, దుబ్బ తండా, చెదురుపల్లి, బైరాపురం, అజిలాపూర్, లింగారెడ్డిపల్లి, పోతేపల్లి తదితర గ్రామాలలో, తండాలలో వాల్ పోస్టర్ వేశారు. ఈ కార్యక్ర మంలో బి మండల నాయకులు వెంకటయ్య ,రవికుమార్ ,అంజయ్య, బాలు నాయక్, సంజయ్ నాయక్,కొండల్ యాదవ్,శ్రీను, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**సంగారెడ్డి ఏప్రిల్ 25 (జనం సాక్షి)** ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుదేరా గ్రామంలో చోటుచేసుకుంది. మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ వివరాల ప్రకారం బుదేరా గ్రామ శివారులో వ్యవసాయ పొలం లోని మేడి చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించడం జరిగిందని ఎస్సై తెలిపారు. సమాచారాన్ని సోషల్ మీడియా లో పెట్టగా, బుదేరా గ్రామంలో ని వ్యక్తి అని తెలిసినదన్నారు, ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కోలకుందా శ్రీనివాస్(40)అని మృతుడి భార్య కోలకుందా స్వప్న తెలిపినట్లు ఎస్సై వివరించారు. మృతుడు శ్రీనివాస్ ఈనెల 23 ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపినదన్నారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.



## "ఏఏఏ అబాకస్ 2.0" ఉచిత శిక్షణ యాప్ పోస్టర్ ఆవిష్కరణ

**సంగారెడ్డి,ప్రతినిధి ఏప్రిల్ 25 (జనం సాక్షి)**

విద్యార్థుల గణిత నైపుణ్యాలను పెంపొందించేందుకు రూపొందించిన "ఏఏఏ అబాకస్ 2.0" యాప్ ఉచిత శిక్షణ కార్యక్రమ పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ వ్యవస్థాపకులు అడ్లగట్ట గంగాధర్ మాట్లాడుతూ న్యూరో టెక్నాలజీ ఆధారంగా అభివృద్ధి చేసిన ఈ అబాకస్ యాప్ ద్వారా విద్యార్థులు తమ చేతివేళ్లపై వేగవంతంగా జమ, తీసివేత, గుణాకార, భాగాహార లెక్కలను శిక్షణ పొందగలుగుతారన్నారు. 10,000 వరకు సంఖ్యలను వేగంగా లెక్కించే సామర్థ్యం ఈ విధానంలో ఉందని వివరించారు.ఈ శిక్షణ శిబిరం పూర్తిగా ఆన్లైన్ ద్వారా నిర్వహించబడుతుంది. 2వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఈ యాప్ ద్వారా లెవెల్-1 శిక్షణను ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. యాప్ యాక్సెస్ కోసం కేవలం రూ.99 చెల్లించాల్సి ఉంటుంది.జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో గణితం పట్ల భయం పోయి, ఏకాగ్రత మరియు జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ వెంకటేశం, ఏఎంఓ (అకడెమిక్ మానిటరింగ్ ఆఫీసర్) బాలయ్య, జిసిడిఓ సుప్రియా, ప్లానింగ్ కోఆర్డినేటర్ తాజుద్దీన్ అధికారులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

**- అవగాహన సదస్సులో సిద్దిపేట ఆర్డిఓ సదానందం**




**చేర్యాల ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** పెండింగ్ సాదాబై నామా దరఖాస్తులు నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతిలో పరి ష్కారం అవుతాయని సిద్దిపేట ఆర్డీవో సదానందం తెలిపారు. చేర్యాల మండల కేంద్రంలోని రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రైతు వేదిక వద్ద నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆర్డిఓ సదానందం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఏప్రిల్ 14 2025న భూభారతి చట్టం అమల్లోకి వచ్చిందని, పెండింగ్ సాదాబై నామా దరఖాస్తులు నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతిలో పరి ష్కారం అవుతాయని తెలిపారు. భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను రైతులకు వివరించారు. భూభారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల నాగుల శ్వేతా- వెంకన్న, పిఎసిఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ గౌడ్, చేర్యాల తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్, చేర్యాల వ్యవసాయ అధికారి పులి భోగేశ్వర్, ఎంపీడీఓ మహబూబ్ అలీ, చేర్యాల ఆర్ఐ రాజేందర్ రెడ్డి, ఐలయ్య, మండల స్పెషల్ ఆఫీసర్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాశ్మీర్ ఉగ్రదాడిపై ముస్లింల నిరసన



**శివ్వంపేట ఏప్రిల్ 25 జనంసాక్షి:**
కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గంలో ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన హింసకాండ ను నిరసిస్తూ, మండల కేంద్రమైన శివ్వంపేట మసీదులో శుక్రవారం జామా నమాజ్ అనంతరం ముస్లిం పెద్దలు, యువకులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన తెలియజేశారు. ఈ నిరసనలో మత గురువు తో పాటు షేక్ అలీ, ఖదీర్, సద్దాం, అబ్దుల్ కరీం తదితరులు ఉన్నారు.

# డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**డిజిటల్ లైబ్రరీ విభాగాన్ని ప్రారంభించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి**



**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 25 (జనం సాక్షి):**
డిజిటల్ లైబ్రరీని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా కేంద్రంలో గ్రంథాలయంలో నూతన డిజిటల్ లైబ్రరీని విభాగాన్ని శుక్రవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజుతో కలిసి ప్రారంభించారు. లైబ్రరీని పరిశీలించి ఇంటర్నెట్ సౌకర్యం, వసతులు గురించి ఆరా తీశారు. కలెక్టర్ స్వయంగా కంప్యూటర్ ఆన్ చేసి ఇంటర్నెట్ వసతిని పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీని ప్రారంభించడం ద్వారా, ప్రజలకు సమాచారం, విద్యా వనరులను అందించడం ద్వారా, వారి జ్ఞానాన్ని పెంచడానికి సహాయపడుతుంది. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ఇంటర్నెట్ సేవలతో కూడిన డిజిటల్ లైబ్రరీకి పది కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీని నెలకొల్పామన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగులు నగరానికి వచ్చి జిల్లా కేంద్ర గ్రంథాలయ సేవలను వినియోగించుకుంటున్నారన్నారు.

ప్రస్తుతం డిజిటల్ లైబ్రరీ కూడా అందుబాటులోకి వచ్చినందున పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ మరింత మంది పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరచాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పోటీ పరీక్షలు, వివిధ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పరీక్షల మెటీరియల్ ను ఆన్లైన్ ద్వారా సేకరించుకునేందుకు డిజిటల్ లైబ్రరీ ద్వారా వీలు కలిగిందన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ మెదక్ జిల్లా గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా తీర్చిదిద్దుతున్నట్లు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అవసరమైన మరిన్ని బుక్స్, జర్నల్స్‌ను సమకూర్చడంతో యువతీ యువకులు పోటీ పరీక్షలలో ప్రతిభను చాటి వివిధ శాఖలలో ప్రభుత్వ కొలువులు సాధిస్తున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో గ్రంథాలయాలు మరింత అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామని చిలుమల సుహాసిని రెడ్డి పేర్కొన్నారు. గ్రంథాలయ సెక్రెటరీ వంశీకృష్ణ, సిబ్బంది నరేందర్ రెడ్డి, శంకర్, యాదగిరి, మురళి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిది చెక్కు పంపిణీ



**నాగల్గిద్ద ఏప్రిల్ 25 (జనం సాక్షి)**
నాగల్గిద్ద మండలం ఎస్గి గ్రామానికి చెందిన ఆశాబి రూ. 39,500/- రూపాయలు సీఎం సహాయనిది ద్వారా మంజూరు అయిన చెక్కును శుక్రవారం ఉమ్మడి మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నాగేష్ షేట్కార్, యువనేత సాగర్ షేట్కార్ బాధిత కుటుంబ సభ్యులు తయాబ్ కు అందించారు. ఈ కార్యక్రమంలో పురంజాన్, మాజీ ఎంపీటీసీ, రహీమ్, కృష్ణా, ఎకనాథ్,తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ కోర్సులు

**శివ్వంపేట ఏప్రిల్ 25 జనంసాక్షి:** శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామ శివారులోని గ్లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాలలో టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫార్మసీ విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులు, అలాగే స్కాలర్షిప్ అందించడానికి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష లో విజయం సాధించిన వారిలో నీలం సంధ్య, అత్తెల్లి వంశీ సిద్ధార్థ రెడ్డి, విస్లావత్ చంటి నాయక్, తొగిట కళ్యాణ్ రామ్ గౌడ్ తదితరులు ఉన్నారు. విద్యార్థులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని జీవితం లో ఉన్నతా శిఖరాలను అధిరోహించాలని గ్రాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కాలేజీ ప్రొఫెసర్ కమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివసుబ్రమన్యన్, కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ కల్లూరి సతీష్ కుమార్, డాక్టర్ షేక్ రెహానా, పర్వీన్, రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ఉచిత మెగా వైద్య శిబిరం



**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 25 (జనం సాక్షి)**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చిన్న శంకరంపేటలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొని రోగుల కు మందులను పంపిణీ చేశారు. మెడిసిటీ వైద్యులు కంటికి థైరాడ్ వంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ లైన్ ఏలేటి రాజశేఖర్, వైస్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, శ్రీనివాస్ ,సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ పక్కాగా జరగాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 25 (జనం సాక్షి):**
ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ పక్కాగా జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ టెలికాన్ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి హౌసింగ్ పీడీ మాణిక్యం, డిపిఓ యాదయ్యతో కలిసి శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ కార్యక్రమంపై సంబంధిత ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ ఉద్దేశించి జిల్లా కలెక్టరేట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు నియమితులైన వెరిఫికేషన్ అధికారులకు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హులైన లబ్ధిదారులను ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన నివేదికల ననుసరించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయుట, పరిశీలించుటకు ఎంపీడీవోలు ఎ.ఈ, ఏ.ఓ.,ఎంపీవోలను టీంగా ఏర్పాటు చేసిన బృందానికి పర్యవేక్షణ అధికారిగా మండలాల ప్రత్యేక అధికారులుగా ఉంటారని, జిల్లాలోని 21 మండలాలతో పాటు మున్సిపాలిటీలను కలిపి మొత్తం 67 మంది వెరిఫికేషన్ అధికారులను నియమించడం జరిగిందని, ఈ మొత్తం ప్రక్రియ ఏప్రిల్ 30 వరకు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో వెరిఫికేషన్ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలన్నారు. వెరిఫికేషన్ అధికారులు వెరిఫికేషన్ లిస్టులో ఉన్న వాటి వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే తరలించాలి

- ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి



**కొల్చారం, ఏప్రిల్ 25 (జనం సాక్షి):**
కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా రైస్ మిల్లులకు తరలించి కాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని నరసాపురం ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లాలోని కొల్చారం మండలం రాంపూర్ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, పైతర, కోనాపూర్, ఏటిగడ్డ మాందాపూర్ గ్రామాలలో రంగంపేట ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను రంగంపేట సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం యాసంగిలో రోగాల బారిన పడి వరి ధాన్యం దిగుబడి తక్కువగా వచ్చిందని, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 10 రోజులైనా తూకం సాగకపోవడంతో రైతులు ఇబ్బందులు ఉన్నారని అన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని లారీలు పంపించి ఈరోజు కా రోజు రైస్ మిల్లులకు పంపించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మమ్మల్ గఫర్ మియా, డిప్యూటీ తాసిల్దార్ నాగవర్ధన్, కొడిపల్లి ఏడిఏ పుణ్యవతి, కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి, కొల్చారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌర్శంకర్ గుప్తా, మండల యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, టిఆర్ఎస్ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సి డి సి మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, చిట్యాల యాదయ్య, రాజగౌడ్, బోయిని ఆంజనేయులు, గౌరీశంకర్, సిద్ధి రాములు, బాగారెడ్డి, జంగిటి పోచయ్య, ఆరే రవీందర్, కిష్టాపూర్ నాగరాజ్, చిట్కుల సురేష్, ఐకెపి ఎపిఎం సుశీల్య, సీసీ సవిత, సొసైటీ సీఈఓ నవీన్, సిబ్బంది బీరప్ప, సిద్దు, శ్రీనివాస్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

- గోపాల్ పేట్ ఎస్ఐ నరేష్ కుమార్

**రేవల్లి, ఏప్రిల్ 25 (జనంసాక్షి)**
గోపాల్ పేట మండలంలోని బస్టాండ్ దగ్గర సైబర్ అవేర్నెస్ ప్రోగ్రాం ఓటిపి ఫ్రాడ్స్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ పేట్ ఎస్ఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ తెలియని ఫోన్ నెంబర్ల నుండి ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం సేవించి విహానాలు నడపరాదని అవగాహన కల్పించారు. అదే విధంగా ఎండలు ఎక్కువగా ఉన్నందున తీసుకోవాల్సిన తగు జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు గోపాల్ పేట్ ఎస్ఐ నరేష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఉర్కొండ ఎంపీడీవో కృష్ణయ్య



**ఉర్కొండ , ఏప్రిల్ 25, (జనం సాక్షి) :**
మండలంలోని గ్రామపంచాయతీలలో వేసవికాలం దృశ్య తాగునీటి సమస్యలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మండల ఎంపీడీవో కృష్ణయ్య తెలియజేశారు. శుక్రవారం మాదారం, గుడిగానిపల్లి గ్రామాలను మిషన్ భగీరథ ఏఈ రోహిత్, ఏ.ఈ., నాగమణి (ఏ.ఈ.ఆర్.డబ్ల్యూ. ఎస్),లక్ష్మణ్(ఎంపీఓ)తో కలిసి సందర్శించి సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ (ఇంట్రా) లైన్‌మెన్‌లకు సూచనలు చేశారు. త్రాగునీటి సమస్య తలెత్తినట్లయితే గ్రామంలోని గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటి సరఫరా చేయుటకు, త్రాగునీటి పైప్ లైన్ రిపేర్లు వస్తే వెంటనే మారమ్మత్తు చేయించుటకు, రాబోయే రెండు నెలలు జాగ్రత్తగా నీటిని వినియోగించుకొనుటకు, నీటి వృధాను అరికట్టుటకు అన్ని కాలనీలకు సమానంగా నీటిని సరఫరా చేయుటకు సూచించారు. అలాగే రెండు గ్రామాల్లోని నర్సరీలను సందర్శించారు.

## పశువులకు టీకాలు వేయించుకోవాలి



**తూప్రాన్ ఏప్రిల్ 25 (జనం సాక్షి):**
చూడి పాలిచ్చే పశువులకు టీకాలు తప్పనిసరిగా వేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య తెలిపారు. రామయపల్లి, రావెల్లి గ్రామంలో పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులలో గాలి కుంటు వ్యాధి రాకుండా టీకాలు ఉచితంగా వేసినట్టు చెప్పారు. 92 పైగా ఆవులలో 335కి పైగా నల్ల పశువులలో విషయం అన్నారు. పశువులలో ,చూడి , పాలిచ్చే వాటిలోనూ కూడా టీకాలు వేసుకోవాలని డాక్టర్ వెంకటయ్య తెలిపారు. ఈ. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి, డాక్టర్ లక్ష్మీ, పశు వైద్య సిబ్బంది రాజిరెడ్డి, కృష్ణ కుమార్, గోపాలమిత్రులు రామస్వామి, శేఖర్, శ్రీనివాస్,సిబ్బంది చిరంజీవి,కృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- మండల విద్యాధికారిని మంజుల దేవి




**జడ్చర్ల, ఏప్రిల్ 25 (జనం సాక్షి):**
అవోపా ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జడ్చర్ల మండల విద్యాధికారిని మంజులాదేవి పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుబోవు విద్యార్థులకు ఆర్యవైశ్య ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఉదయ మెమోరియల్ పాఠశాలలో ఎంఈఓ మంజులా దేవి తిమ్మాజీపేట మండల విద్యాధికారి సత్య నారాయణ శెట్టితో కలిసి ప్రారంభించారు. 200 మంది తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు శిబిరానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంజులాదేవి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ సెలవుల్లో పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం, తిమ్మాజీపేట మండల విద్యాధికారి సత్య నారాయణ శెట్టి నిర్వహణలో పేద విద్యార్థులకు విద్యాసంబంధ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల అవోపా అధ్యక్షుడు మురళీకృష్ణ, శివకుమార్, రాష్ట్ర బాధ్యులు గుండ్ల శ్రీనివాసులు, తిరుపతయ్య, సతీష్ కుమార్, వజ్రాలింగం, శ్రీధర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## మలేరియా రహిత మండలంగా తీర్చిదిద్దాలి

: మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్



**వీపనగండ్ల ఏప్రిల్ 26 (జనం సాక్షి)**
వీపనగండ్ల మండల కేంద్రంలోని సామాజిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ మండలాన్ని మలేరియా రహిత మండలంగా తీర్చిదిద్దాలని అన్నారు. మలేరియా వ్యాధి రాకుండా శుభ్రత పాటించాలని, మలేరియా వ్యాధి లక్షణాలు అనిపిస్తే వెంటనే ఆసుపత్రికి లో చికిత్స చేయించుకోవాలని అన్నారు. హెచ్.ఈ కేశవులు, హెల్త్ అసిస్టెంట్ జహంగీర్, రామచంద్రమ్మ ఏఎన్ఎం, ఆసుపత్రి సిబ్బంది, ఆశ వర్కర్లు ర్యాలీలో పాల్గొన్నారు.

## ఉగ్రదాడి నిరసిస్తూ నవాబుపేటలో ర్యాలీ



**శివ్వంపేట ఏప్రిల్ 25 జనంసాక్షి :**
కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడి నిరసిస్తూ, మండల పరిధిలోని నవాబుపేట గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఇంద్రేష్, మహేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, అక్బర్, వినోద్ గౌడ్, సాయిరాం, ప్రేమ్ కుమార్, శ్రవణ్ కుమార్, నరేందర్ రెడ్డి, భరత్ గౌడ్, పవన్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, రాజేష్, ఐన్నీలతోపాటు గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## చెక్ పోస్ట్ దగ్గర అప్రమత్తంగా ఉండాలి

తాహసిల్దార్ వేంకటేష్

**కృష్ణ, ఏప్రిల్ 25 (జనం సాక్షి):**
రబీ సీజన్లో పోరుగు రాష్ట్రం నుండి అక్రమంగా వరి ధాన్యం రాకుండా ఉండేందుకు కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో బార్డర్లో ఏర్పాటుచేసిన కృష్ణ, చేగుంటా, చెక్ పోస్టులను తహశీల్దార్ బి వెంకటేష్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ.. చెక్ పోస్ట్ దగ్గర విధులు నిర్వర్తించే పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండి కర్ణాటక రాష్ట్రం నుండి జిల్లాలోకి వరి ధాన్యం రాకుండా చూడాలని ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ వాహనాల నెంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. వరి ధాన్యం వాహనాలు వస్తే రెవెన్యూ అధికారులకు అప్పగించాలని లేదా, వాహానాలను తిప్పి పంపియాలని సూచించారు. చెక్ పోస్ట్ దగ్గర అప్రమత్తంగా ఉండి వచ్చి పోయే వాహానాలను జాగ్రత్తగా గమనిస్తూ వాహానాలను తనిఖీ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, పాల్గొన్నారు.



## ప్రజా పాలనలో అభివృద్ధి సుభిక్షం



**వెల్దండ, ఏప్రిల్ 25 (జనం సాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో గ్రామాల,గిరిజన తండాల్లో సంక్షేమ పథకాలను అమలు జరిపి ప్రజలకు అభివృద్ధిని సుభిక్షం చేస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.మోతీలాల్ నాయక్ అన్నారు. శుక్రవారం ఏఐసీసీ పిలుపు మేరకు గానుగట్టు తండాల్లో జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయంలోనే గ్రామీణ ప్రాంతాలలో,గిరిజన తండాల్లో దళిత,గిరిజన,అణగారిన వర్గాల ప్రజలకు అనేక రాజ్యాంగ హక్కులతో ఆర్థిక, రాజకీయ,సామాజిక రంగాలలో అభివృద్ధితో పాటు ఉద్యోగ,ఉపాధి అవకాశాలను కల్పించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్ రెడ్డి,యువజన కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్ళపల్లి శేఖర్,మాజీ సర్పంచ్ పత్యానాయక్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్ర శ్రీను, యువజన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్,మహిళా నాయకురాలు రాణి తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్‌లో పలువురు చేరిక





**చేర్యాల ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కడుదూరి వీరారెడ్డి, అనుముల రాజశేఖర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బీ.ఆర్.ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఇంత వరకు నెరవేర్చలేదు అని, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పై నమ్మకం పోయిందని తెలిపారు. రక్షించేది బి.ఆర్.ఎస్ పార్టీ ఏ నని అందుకే ఈ పార్టీలో చేరుతున్నాం అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేష్ గౌడ్, బి.ఆర్.ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పాల బాలరాజు, బి.ఆర్.ఎస్. నాయకులు శనిగరం లక్ష్మణ్, జంగిటి బిక్షపతి, సోషల్ మీడియా వారియర్స్ మల్లమారి నవీన్, గోనెపల్లి మహేష్, ముస్త్యాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

## విందుకు వచ్చి .. నీట మునిగి

**పాపన్నపేట,ఏప్రిల్ 25(జనంసాక్షి):**



మెదక్ జిల్లా ఏడుపాయలలో విందుకు వచ్చి ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు.. నాగర్ కర్నూలు జిల్లా కొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన దేవరపాగ వీరస్వామి (40) గత కొన్ని సంవత్సరాలుగా రామచంద్రపురం మండలంలో ఉంటూ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఓ విందు నిమిత్తం కుటుంబంతో కలిసి ఏడుపాయలకు వచ్చారు. స్నానం చేసేందుకు ఆలయ సమీపంలో ఉన్న చెక్ డ్యాం వద్దకు వెళ్లి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి పోయాడు. అక్కడే ఉన్న కుటుంబీకులు గమనించి కాపాడే ప్రయత్నం చేశారు. పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో నీటిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య మల్లీశ్వరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

సన్మార్గంలో నడిచేందుకు..

## ఆధ్యాత్మికంతో పాటు క్రీడలు అవసరం

- ఆదిత్య పరాశ్రీ స్వామి
- అంబాత్రయ క్షేత్రంలో అట్ట హాసంగా ఆటల పోటీలు ప్రారంభం



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 25, (జనం సాక్షి):** చిన్నతనం నుంచే సన్మార్గంలో నడిచేందుకు ఆధ్యాత్మికంతో పాటు ఆటలు ఎంతో అవసరమని బిజ్వార్ అంబాత్రయ క్షేత్ర వ్యవస్థాపకులు ఆదిత్య పరాశ్రీ స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని బిజ్వార్ గ్రామంలో నీఅంబాత్రయ క్షేత్రం ఆవరణలో 44వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలు 25 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే పోటీలను ఆదిత్య పరాశ్రీ స్వామి ప్రారంభించారు. ఈ పోటీలు అట్ట హాసంగా ప్రారంభం అయ్యాయి.ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతు ఆధ్యాత్మికంతోనే భక్తి సన్మార్గం ఏర్పడుతుందని అన్నారు. అలాగే క్రీడలు క్రమశిక్షణ అలవరుస్తా యని దాంతో వ్యసనాలకు దూరమై ఆరోగ్యంగా ఉంచుతాయి అన్నారు. ఆరోగ్యంఆధ్యాత్మికం తోడైతే సన్మార్గం ఏర్పడుతుందని అన్నారు. అందరూ సన్మార్గంలో నడిచి దేశభక్తి ఆధ్యాత్మిక తను పెంపొందించాలని ఉపదేశించారు. ఈ క్రీడల్లో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుండి 600 మంది బాలబాలికలు షూటింగ్ బాల్ పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ సిహెచ్ ఐలయ్య టోర్నమెంట్ ఆర్గనైజర్ రమేష్ రిటైర్డ్ పిఈటి గోపాలం.పిడిలు, పిటిలు విష్ణువర్ధన్ రెడ్డి. ఆంజనేయులు మంజునాథ్ శ్రీనివాస్ పవన్ సాయి రాఘవేందర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపు ప్రారంభం



**మాగనూర్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆఫ్ ఉచిత సమ్మర్ క్యాంపును శుక్రవారం గ్రామ పెద్దలు ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు ఆర్మీ మాట్లాడుతూ క్యాంపులో 10 నుండి 20 సంవత్సరాల వయసుగల యువతీ యువకులు దాదాపుగా 50 నుండి 60 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. ఈ క్యాంపు జూన్ 10వ తేదీ వరకు కొనసాగుతుందని సమయం ఉదయం 6:30 నుంచి 8:30 వరకు సాయంత్రం నాలుగు గంటల నుంచి 5:30 వరకు ఉంటుందని ఎమ్మార్వో ఆఫీస్ పక్కన గ్రౌండ్లో క్యాంపు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వివిధ గ్రామాల యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఈ క్యాంపు ద్వారా కబడ్డీ వాలీబాల్ అథ్లెటిక్ కి సంబంధించిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని క్యాంప్ ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో వివిధ క్రీడారంగాల్లో ముందుకు వెళ్లే విధంగా తీర్చిదిద్దుతామని అన్నా రు. అదేవిధంగా విద్యార్థులు ఆర్మీ, పోలీస్ ఉద్యోగాలకు వెళ్లాలనుకున్న వారికి ఈ క్యాంపు ద్వారా శిక్షణ లభిస్తుందని చెప్పారు. అనంతరం గ్రామ పెద్దలు ఆంజనేయులు ఆర్మీ పిడి రాకేష్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పి ఈ టీ వెంకటేష్ మాజీ సర్పంచ్ రాజు గ్రామ పెద్దలు ఆనంద్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, కే కృష్ణయ్య, చెన్నప్ప, అశోక్ గౌడ్, రాంగోపాల్ శెట్టి, పూల రాము, నర్సిలు, వెంకటేష్ గౌడ్ (జానీ) విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు సదాశివపేటలో నిరసన ర్యాలీ

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 25( జనం సాక్షి)** పశ్చిమ బెంగాల్, జమ్ము కాశ్మీర్ పహల్గాంలో అమాయక హిందూ యాత్రికులను మతం పేరుతో ఆటవికంగా చంపిన దానికి నిరసనగా శనివారం ఉదయం 10 గంటలకు సదాశివపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు హిందూ సోదరులు పిలుపునిచ్చారు. ఈ భారీ ర్యాలీకి వివిధ కుల సంఘాలు, ఆలయ కమిటీల సభ్యులు, హిందువులు సదాశివపేటలోని స్థానిక బసవేశ్వర మందిరం వద్దకు చేరుకోవాలని కోరారు. మాణిక్ ప్రభు మందిరము నుండి పోలీస్ స్టేషన్ వరకు పురవీధులగుండా సాగే నిరసన ర్యాలీలో హిందు బాంధవులందరు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. హిందువుల పై దాడులను అరికట్టాలని కోరుతూ ఎమ్మార్వో కు వినతి పత్రం ఇవ్వాలని తీర్మానించడం చేయడం జరిగిందని తెలిపారు.

## నేడు ఆకునూరులో శత చండీ యాగం ప్రారంభం



**చేర్యాల ఏప్రిల్ 25, (జనంసాక్షి) :** మండలంలోని ఆకునూరు గ్రామంలో శనివారం నుండి బుధవారం వరకు శ్రీ రుద్ర సహిత శత చండీ యాగం లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న ట్లు చేర్యాల జాక్ చైర్మన్ చక్రదారి తెలిపారు. పంచ అహి నిక దీక్షతో వేద పండితులు నిర్వహిస్తున్న శాత చండీ యాగం వలన చేర్యాల జనగామ సిద్దిపేట పరిసర గ్రామాలు సస్యశ్యామలం కావాలని సమృద్ధిగా వర్షాలు కురవడంతో పంటలు సాగు పెరిగి ప్రజలు అందరూ సంతోషంగా జీవించాలని కోరుకుంటున్న ట్లు జాక్ చైర్మన్ చక్రదారి చెప్పారు. వంద మంది వేద పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అనఘా ఫౌండేషన్ నాగిళ్ల హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపి లు, చేర్యాల ప్రాంతా అన్ని పార్టీల నాయకులు వేల సంఖ్యలో మహిళలు పాల్గొంటార ని హరికృష్ణ తెలిపారు. పండితులు గంగాధర కేదారి ఘనపాఠి, వేద పండితులు కాప్రాగురూ జి, మాధవ నంద స్వామి, భైరవబట్ల సీతారాం శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని..

**పాపన్నపేట,ఏప్రిల్ 25(జనంసాక్షి):**



గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేటలో శు క్రవారం వెలుగు లోకి వచ్చింది.స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి..ఓ గుర్తు తెలియని వ్యక్తి పాపన్నపేట గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఉండటాన్ని శుక్రవారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.వ్యక్తి వయస్సు సుమారు 30 – 40 సంవత్సరాల మధ్య ఉంటుందని ఒంటిపై కుంకుమ రంగు షర్టు,నలుపు గ్రే రంగు ప్యాంటు ధరించి ఉంది.సుమారు పది..పదిహేను రోజుల క్రితం ఉరి వేసుకొని మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.సంబంధీకులు ఎవరైనా ఉంటే మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి చరవాణి నెంబర్ 8712657916 లేదా ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ చరవాణి నెంబర్ 8712657920కు సంప్రదించాలని సూచించారు.